# అమెరికా యుద్ధ ప్రయత్నాలలో భారత్ భాగం కాకూడదు

సెప్టెంబరు 11వ తేదీన అమెరికాపైన జరిగిన దుర్మార్గమైన దాడి నుండి ప్రపంచం తేరుకోకముందే ఆ తరువాతి పర్యవసానాలు ఇంకెంత భయంకరంగా ఉండబోతాయోనన్న భయం పట్టుకుంది.

దీనికి కారణం అమెరికా సెప్టెంబరు 11 నాటి దాడికి స్పందిస్తున్న పద్ధతి. అమెరికా ప్రభుత్వం మీద కోపంతో అమెరికా ప్రజలను చంపడం ఆనాటి దాడిలోని దుర్మార్గం కాగా, అమెరికా అదే పద్ధతిలో ఒసామా బిన్ లాడెన్ మీద కక్షతో అఫ్ఘనిస్తాన్‌ను మొత్తంగా నాశనం చేయడానికి సిద్ధపడడం ప్రస్తుతం ప్రపంచాన్ని కలచివేస్తున్న ఆందోళనకు కారణం. కాందహార్ పట్టణాన్నీ పరిసర గ్రామాలనూ ఖాళీచేసి పాకిస్తాన్‌కో ఇరాన్‌కో దొరికిన వాహనం ఎక్కి తరలిపోతున్న అఫ్ఘనిస్తాన్ ప్రజల ఫోటోలు వరల్డ్ ట్రేడ్ సెంటర్ కుప్పకూలిపోతున్న దృశ్యంకంటె తక్కువ దయనీయమైనవి కావు.

నిజానికి న్యూయార్క్ పైన, వాషింగ్టన్ పైన జరిగిన దాడి అమెరికా కళ్లు తెరిపించి ఉంటే ఆ దుర్మార్గమైన దాడి కూడ ఒక ప్రయోజనం సాధించి ఉండేది. అయితే అటువంటిదేమీ జరగలేదని అమెరికా అధ్యక్షుడు వాడుతున్న భాషను బట్టి తెలుస్తుంది. 'వాడు ఎక్కడున్నా సరే పట్టుకొని కడతేరుస్తాం.' 'దాడి చేసిన వాడినే కాదు వాడికి సహాయం చేసిన వారెవ్వరినీ కూడ వదిలి పెట్టం.' 'పొగపెట్టి వాణ్ని బయటికి రప్పిస్తాం.' 'దీనిని అమెరికా మీద యుద్ధంగా భావిస్తున్నాం.' 'ఇది 21వ శతాబ్దపు మొదటి యుద్ధం.' 'మాకు లాడెన్ అయినా కావాలి, వాడి శవమైనా కావాలి.' - ఇత్యాది.

ఇందులో కొన్ని ప్రకటనలు ముంబాయి వంటి నగరాల మాఫియాల ప్రకటనలను పోలి ఉన్నాయి. ఛోటాషకీల్, అరుణ్ గావ్లీ వంటి వారు ఇటువంటి సవాళ్లు విసురుకుంటారు. ప్రపంచంలోని అత్యంత నాగరికమైన దేశంగా తనను తాను భావించుకునే దేశం ప్రయోగించవలసిన భాష కాదు ఇది.

మిగిలిన ప్రకటనలు విడ్డూరమైనవి. మొన్న జరిగిన దాడి 21వ శతాబ్దపు మొదటి యుద్ధమైతే అమెరికా ఇరాక్‌పైన చేసిన దాడి 20వ శతాబ్దపు ఆఖరి యుద్ధమా? సద్దాం హుస్సేన్‌ను లొంగదీసుకోవడానికి ఆ దేశ ప్రజా జీవితాన్ని అమెరికా సంపూర్ణంగా ధ్వంసం చేసింది. ఆర్థికంగా, పారిశ్రామికంగా నాశనం చేయడమే కాక వర్తకంపైన ఆంక్షలు విధించడం ద్వారా అత్యవసరమైన మందులు సహితం ఇరాక్ ప్రజలకు లేకుండ చేసింది. ఈ కారణంగా కనీసం 5 లక్షల మంది చనిపోయారని - అందులో అత్యధికులు పసిపిల్లలని - అంచనా. ఇది అన్యాయం అని రెడ్‌క్రాస్ వంటి తటస్థ సంస్థలు సహితం అభ్యంతరం లేవదీయగా, 'ఆ మూల్యం చెల్లించదగినదే'నని క్లింటన్ హయాంలో విదేశాంగ కార్యదర్శిగా ఉన్న మేడలీన్ ఆల్‌బ్రైట్ అన్నారు. ఎవరు చెల్లించదగిన మూల్యం అది? ఎందుకోసం?

మొన్న న్యూయార్క్‌లోని వరల్డ్ ట్రేడ్ సెంటర్‌ను కుప్పకూల్చిన వారు కూడా 'ఆ మూల్యం చెల్లించదగినదే' అనవచ్చునా? ఇద్దరి వైఖరీ ఒకటే అయినప్పుడు 'ఇది మంచికీ చెడుకూ మధ్య సంఘర్షణ' అనీ 'నాగరికతకూ అనాగరికతకూ మధ్య ఘర్షణ' అనీ అనడం ఎందుకు?

'శత్రువును లొంగదీసుకోవాలంటే ఆ శత్రుదేశ ప్రజలను చంపు' అనేది కనీసం యాభై ఏళ్లుగా

## బహిరంగ సభ

సెప్టెంబర్ 26 బుధవారం

బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో

సాయంత్రం 6 గంటలకు

## వక్తలు

ప్రొఫెసర్ రమా మెల్కోటే - మాజీ డైరెక్టరు, సెంటర్ ఫర్ ఏరియా స్టడీస్

ఆర్.కె. హంగ్లూ - రీడర్, సెంట్రల్ యూనివర్శిటీ

ఎం.వి. కృష్ణయ్య - ఒపిడిఆర్

కె. బాలగోపాల్ - మానవ హక్కుల వేదిక

అమెరికా అనుసరిస్తున్న విధానమే. జపాన్ చక్రవర్తిని లొంగదీసుకోవడానికి హిరోషిమా నాగసాకీలపైన అణుబాంబులు వేసి మూడున్నర లక్షల మంది సాధారణ ప్రజలను చంపింది. 1970లలో వియత్నాంలో కమ్యూనిస్టు గెరిల్లాలను కాళ్ల బేరానికి రప్పించడం కోసం పంట పొలాలపైన రసాయన యుద్ధం ప్రకటించి వియత్నాం రైతాంగానికి జీవనాధారం లేకుండ చేసింది. గడచిన దశాబ్ద కాలంలో గడ్డాఫీకి 'బుద్ధి చెప్పడానికి' లిబియా ప్రజాజీవితాన్నీ, సద్దాం హుస్సేన్‌కు 'బుద్ధి చెప్పడానికి' ఇరాక్ ప్రజా జీవితాన్నీ, మిలోసెవిచ్‌కు 'బుద్ధి చెప్పడానికి' యుగోస్లేవియా ప్రజా జీవితాన్నీ నాశనం చేసింది. అంతేకాదు తన ఆధిపత్య స్థానాన్ని నిలుపుకోవడానికి అది ప్రపంచ వ్యాప్తంగా టెర్రరిస్టులను, మాఫియాలను, అక్రమ ఆయుధ వ్యాపారులను పెంచి పోషిస్తూ వస్తోంది. లాదెన్‌ను తయారు చేసింది ఎవరు? తాలిబన్లను తయారు చేసింది ఎవరు? ఆనాడు సోవియట్ యూనియన్‌కు వ్యతిరేకంగా వారికి సిఐఎ చేత శిక్షణ ఇప్పించింది ఎవరు?

వారి సూత్రాన్ని వారి మీదే ఎవరో ఒకరు ప్రయోగించబోతారని అమెరికా అనుకోలేదు. తన సాంకేతిక సామర్థ్యం అంతటిదనుకుంది. ముఖ్యంగా, సోవియట్ రష్యా కూలిపోయి పోటీ అగ్రరాజ్యమేదీ లేకుండ పోయిన తరువాత అమెరికా అహంకారానికి పట్టపగ్గాలు లేకుండ పోయాయి. తన పాఠం తనకి చెప్పేవాళ్లు ఈ నేలమీద పుట్టలేదనుకుంది. అదే అమెరికా చేసిన పొరపాటు. దౌర్జన్యంలో గుత్తాధిపత్యం ఎక్కువ రోజులు నిలవదు. ఆ విషయాన్ని విషాదకరమైన పరిస్థితులలో గ్రహించవలసి రావడం అమెరికాకు ఉక్రోషం తెప్పించవచ్చును గాక - కానీ ఆ ఆగ్రహాన్ని న్యాయమైన ప్రతిస్పందనగా మనబోటి దేశాలు ఎందుకు భావించాలి? 'మేము రుజువు చేయము. మమ్మల్ని సాక్ష్యాలు అడగొద్దు. వాడెవడో తెలుసు. ఇది చర్చలకు సమయం కాదు. మేమెవ్వరితోనూ మాట్లాడబోము' అనే వీధి రౌడీ వైఖరిని ఎందుకు వెనకేసుకు రావాలి? ఇప్పటిదాకా ప్రపంచ పోలీసుగా వ్యవహరించిన అమెరికా ఇప్పుడు ప్రపంచ న్యాయస్థానమయింది. ఇంక తనను తాను సృష్టికర్తగా ప్రకటించుకోవడమొక్కటే తరువాయి.

బుద్ధి రావలసిన సమయంలో బుద్ధి మరీ వికటించడం చాలా విచారకరం. అయితే మన దేశ పాలకులూ దేశంలోని రాజకీయ విశ్లేషకులూ ముస్లింలపట్ల ద్వేషంతో ఇదే అదనని అమెరికా యుద్ధ ప్రయత్నాలకు మద్దతు ఇవ్వడానికి సిద్ధపడుతున్నారు. పనిలో పనిగా పాకిస్తాన్‌ను ఇరకాటంలో పెట్టి కాశ్మీర్ సమస్యను శాశ్వతంగా 'పరిష్కారం' చేసేసుకోవచ్చునని కూడ ఆశిస్తున్నారు. ముస్లిం మతోన్మాదాన్ని ఎదుర్కొనే పేరు మీద ముస్లిం ప్రజానీకంపైన యుద్ధం ప్రకటించడానికి సిద్ధపడుతున్న అమెరికా రాజకీయ నీతికి వంతపాడుతున్నారు. సెప్టెంబరు 11 నాటి దాడికి కారకులెవరన్న ఆధారాలేవీ ప్రకటించకుండా అఫ్ఘానిస్తాన్ పైన యుద్ధానికి కాలుదువ్వుతున్న అమెరికాకు స్థావరాలు కల్పించడానికి తయారవుతున్నారు.

దీనిని మనం నిర్ద్వంద్వంగా వ్యతిరేకించాలి. ముస్లిం మతోన్మాద బృందాలు ప్రపంచానికి ఎంత సమస్యో అమెరికా వంటి దేశాల సైనిక పెత్తనమూ అంతే సమస్య. నిజానికి ఇరాక్‌లోనూ అఫ్ఘానిస్తాన్‌లోనూ కూడ ఈ రోజు రాక్షసులుగా చూపిస్తున్న వారి ఆవిర్భావానికి ఒకనాటి అమెరికా సైనిక వ్యూహాలే కారణం. ప్రపంచానికి కావలసింది అనంతంగా సాగే ఈ హింసాత్మక వ్యూహ-ప్రతివ్యూహాల సంఘర్షణ కాదు. అందులో ఏదో ఒకదాన్ని ఎంచుకొని దాని గొడుగు కింద మన ప్రయోజనాలు కాపాడుకుందామన్న ఆలోచన గుడ్డిది, అనైతికమైనది, అమానవీయమైనది.

న్యూయార్క్, వాషింగ్టన్‌లలోని కొన్ని భవనాల మీద జరిగిన దాడిని నిర్ద్వంద్వంగా ఖండించవలసిందే. కాని ఆ దాడికి ఒక మతం వారిని లేదా ఒక దేశం వారిని బాధ్యుల్ని చేసి 'శిక్షించ' బూనడం అన్యాయం, దుర్మార్గం.

ప్రపంచానికి కావలసింది ప్రపంచ సమస్యల న్యాయబద్ధమైన పరిష్కారానికి అనువయిన అంతర్జాతీయ వ్యవస్థ. ఐక్యరాజ్యసమితి ఒకనాడు ఆ లక్ష్యంతోనే ఏర్పడింది. దానిని ఎందుకూ కొరగాకుండ చేసిన ఘనత అన్ని అగ్రరాజ్యాలకంటె ఎక్కువగా అమెరికాకు చెందుతుంది. ఇప్పుడు భారత్ వంటి దేశాలు సంకుచితమైన ద్వేషాలనూ ప్రయోజనాలనూ పక్కన పెట్టి ఆ ప్రయత్నానికి తిరిగి ప్రాణం పోయాలే తప్ప ఎట్టి పరిస్థితిలోనూ అమెరికా యుద్ధ వ్యూహంలో భాగం కాకూడదు.

**24.9.2001** **మానవ హక్కుల వేదిక (HRF)**

**ప్రజాస్వామ్య హక్కుల పరిరక్షణ సంస్థ (OPDR)**